ఈ సంఘటనలన్నీ సునాదమాల మీద గొప్ప ప్రభావాన్ని చూపినాయి, భయం ..... బెరకు ..... జంకు ..... ఇవన్నీ పైకి కనిపించేవి. అంతర్గతంగా ఆమె హృదయం నిండా స్ట్రాంగ్ సెన్సాఫ్ లవ్ వుంది. గుండె గది ఇనప్పెట్టెలో ప్రేమ అనేది అపూర్వమయిన ఆభరణం. అది అంత తొందరగా ఎవ్వరికీ ఇవ్వకూడదు. ఇస్తే మాత్రం మనసా, వాచా కర్మణా దగ్గరవ్వాలి ఇలాంటి భావాలు పునాదిగా సునాదమాల పెరిగింది. ఆ అమ్మాయికన్నా ఆమె బామ్మే నయం ఇంకా ఆ పాతకాలం బాడీ లేమిటి ..... బ్రాలు వేసుకో అందులోనూ న్యూలుక్ బావుంటుందట అని బామ్మే సలహా ఇస్తూ వుంటుంది. చదివింది ఎనిమిదో క్లాసయినా పాతకాలం చదువు అవటం వల్ల ఇంగ్లీష్‌లో కూడా బామ్మ పెర్‌ఫెక్షనిస్ట్. ఏ కంటి లాష్‌కి ఏ చీర మ్యాచ్ అవుతుందో కూడ అవిడ సరిగ్గా చెప్పగలదు. అవిడకన్నా నలభై ఏళ్ళు చిన్నదయిన సునాదమాల దానికి పూర్తిగా వ్యతిరేకం. ఎప్పుడు కల వచ్చినా ఓ తులసి చెట్టు దాని చుట్టూ తను ప్రదక్షిణ చేయటమే కలగా వస్తుంది.

స్నానం చేస్తున్నంతసేపూ గంట క్రితం జరిగిన సంఘటనే గుర్తువచ్చి కళ్ళవెంట నీళ్ళు ధారాపాతంగా కారుతూనే వున్నాయి ఆమెకి. చాలా సేపు ఏడ్చి స్నానం పూర్తిచేసి బయటకొచ్చింది.

చాలా కాంప్లెక్స్ మెంటాలిటీ సునాదమాలది. లేకపోతే ఆ రోజు డైరీలో ఆ రెండు వాక్యాలు ఏ సందర్భమూ లేకుండా వ్రాసుకోదు

I should like him not only for what he is
But also what i am in his presence
Who is He?

* * * *

ఆగస్టు 13, క్వెజాన్ సిటీ, ఫిలిఫ్ఫైన్స్.

తియెత్ర అదో రాధ వాజాదేవ్ ..... సోవ్ దెఓరియంతే ..... పిల్లలు జాతీయగీతం పాడుతున్నారు. త్రిభుజం మధ్యలో ఎనిమిది కిరణాల సూర్యుడు గల జాతీయజెండా రెపరెప లాడుతూంది అయిదు కోట్ల జనాభ గల దీవులు దాదాపు ఏడువేలు. ఒక పక్క చీనా సముద్రం మరో ప్రక్క పసిఫిక్ ..... ఒకప్పుడు ఈ దీవులన్నీ అగ్ని పర్వతాలు అవి చల్లారినా అక్కడ అగ్ని చల్లారలేదు. బానిసత్వం విప్లవం ప్రజాస్వామ్యం తిరుగుబాటు మిలటరీ పాలన..... చక్రం తిరుగుతూనే వుంది.

క్రీస్తుశకం 1500 నుంచి నాలుగు వందల సంవత్సరాలు స్పెయిన్ దేశపు బందిఖానాలో తరువాత అరవై సంవత్సరాలు అమెరికా అధికారంలో ఆ పై రెండో ప్రపంచ యుద్ధ సమయంలో జపాన్ వశములో వుండి ఇన్నాళ్ళకి స్వేచ్ఛా వాయువుల్ని పీల్చుకున్న దీవులు ..... అయినా అగ్ని పర్వతాలుగా అవి అక్కడ పైకి మామూలుగా కనపడుతున్నాయి లోపల ఉద్రిక్తంగా మరిగిపోతూ వుంటాయి.

ఈ దేశంలో చైనాతో దౌత్య సంబంధాలు పెట్టు కోవటంతో అమెరికాకు కాస్త దూరమైంది. అయినా ఈ దీవుల రక్షణ భారం అంతా అమెరికాయే చూస్తుంది. చైనా పక్కగా వున్న ఈ దీవుల మీద అమెరికా ఆధిపత్యం మరోక అగ్ర రాజ్యానికి నచ్చలేదు.

ప్రధాని సైనిక వందనం స్వీకరిస్తున్నాడు. సైన్యాధ్యక్షుడు స్థానంలో తను నిలబడి సైనిక వందనం స్వీకరిస్తాడు.

కానీ అది అంత సులభం కాదు.

ప్రస్తుతం అధికారంలో వున్న ప్రభుత్వాన్ని పడగొట్టటానికి అయ్యే ఖర్చు మొత్తాన్ని ఆ అగ్ర రాజ్యం స్విస్ బ్యాంక్‌లో వేయటానికి సంసిద్ధత వ్యక్తం చేసింది తప్ప ఆయుధాలు ఇవ్వడానికి వప్పుకోటం లేదు. రేపు ఈ విషయం బయటపడితే మిగతా దేశాలమధ్య అభాసుపాలు అవుతామోనని దేశం భయపడుతోంది.

ఒకే సారి తిరుగుబాటు లేవదీయడం రామోన్ హర్నాసే కిష్టం లేదు. ప్రస్తుతం ప్రధానికి దేశంలో చాలా సపోర్టు వుంది. దాన్ని పోగొట్టాలంటే ముందు అలజడి లేవదీయాలి. గెరిల్లా పద్ధతిలో కమేండోలని తయారు చెయ్యాలి.

వారికి ఆయుధాలు కావాలి.

అయితే ఇదంత లోపాయికారిగా జరగాలి.

ఎన్నాళ్ళో రహస్యంగా ఎంతమందితోనో సంప్రదింపులు జరిపాక అతడికి ఈ ఆయుధాలు సప్లయిచేసే సంస్థ దొరికింది దాని ప్రతినిధికి అతడికీ మధ్య అగ్రిమెంటు కుదిరింది. అతడు చూపించిన సాంపిల్స్ చూసి ఆశ్చర్యపోయాడు రామోన్ హర్నాసే. ఆయుధాలు తయారు చేయటంలో ప్రపంచంలో అందరి కంటే స్వీడన్‌ది పైచేయి. అయుధాల క్వాలిటీ దానికంటే గొప్పగా వుంది.

నేను నీ సంస్థ యజమానిని స్వయంగా కలుసుకోవాలి నమ్మకం కుదిరాక అన్నాడు హర్నాసే.

తప్పకుండా అంటూ భారతదేశానికి తూర్పుగా బంగాళా ఖాతంలో వున్న చిన్న దీవిని మాప్‌తో సూచించి. రండి మీ కోసం ఎదురుచూస్తూ వుంటాము అన్నాడు.

ఈ దీవి భారతదేశపు టూరిస్ట్లకి ప్రసిద్ధి చెందిన ప్రిన్స్‌హోటల్స్ యాజమాన్యంది కదూ?

అవును పైకి కనపడేది అదే ప్రతినిధి నవ్వేడు. కానీ ఈ దివికి టూరిస్టులు రారు.

మరి ఎవరొస్తారు?

అనంతానంతస్వామే యజమాని ఆయనే వస్తారు.

*　　　*　　　*

డిప్యూటీ కమీషనర్ ప్రవల్లిక చెప్పినట్టు అనంతానంతస్వామి ఆయుధాలు చాలా తీవ్రమైనవి.

మతం అయన వెపన్

అతడికి ఆయుధం కర్మాగారం వున్నమాట నిజమే ఒక దేశపు ప్రభుత్వానికి ఆ దేశపు టెర్రరిస్టులకి కూడ అతడు ఆయుధాలు అమ్ముతాడన్నమాట కూడ నిజమే. కేవలం డబ్బు కోసమే అతడు ఇదంతా చేస్తున్నాడంటే అది అజ్ఞానం. అతడు బంగారు కంచంలో తిని బంగారు మంచం మీద పడుకోవటానికి వీలైనంత ధనం అతడి కోట్లాది భక్తులే సమకూర్చగలరు. ప్రవల్లిక చెప్పినట్టు రాజకీయ వ్యాపారంలోనే అతడు కోట్లు కోట్లు సంపాదించగలడు.

అనంతానంతస్వామి ఆశయం వేరు.

మరో అయిదు సంవత్సరాల్లో భారత రాజ్యాధినేత అవ్వాలని అతడి ఉద్దేశ్యం. దానికి గత ఇరవై ఏళ్ళుగా పథకం వేసి తన ఆలోచనల్ని అమలు జరుపుతూ వచ్చాడు. చాపక్రింద నీరులా తన స్కీమ్స్ సాగిస్తున్నాడు.

ప్రజల గురించీ వారి బలహీనతల గురించీ అతడికి బాగా తెలుసు. మనిషి భగవంతున్ని ఎక్కువగా ఎప్పుడు నమ్ముతాడు? సుస్థిరతా భావం పోయినప్పుడు ..... అందుకే అతడు దేశంలో టెర్రరిస్టులకి ఆయుధాలు అమ్ముతాడు. అల్లర్లు జరిపే కొద్దీ ప్రజలకు ప్రభుత్వం మీద నమ్మకం పోతుంది. మరోవైపు ప్రజల్లో మతాన్ని ఇంజెక్ట్ చేస్తాడు. హిందువులు సహనశీలురు వారి సహనాన్ని పోగొట్టాలి.

సోషలిజం కన్నా మతమే తమకు ఎక్కువ భద్రతను కలిగిస్తుందన్న భావం వారిలో ఏర్పడుతుంది. సెక్యూలరిజం లాభం లేదన్న అభిప్రాయం కలుగుతుంది

ఉద్రేకాలు ఆగవు ప్రభుత్వం కూలిపోయింది. తమని రక్షింపగల భగవత్ స్వరూపుడయిన ఒక మహనీయుడయిన వ్యక్తికోసం ప్రజలు ఆకాశం కేసి చూస్తారు. ఆ వ్యక్తి తను గాక మరెవ్వరు? భారతదేశపు ముగ్గురు సైన్యాధిపతులూ నిశ్చయంగా తన కాళ్ల దగ్గిరే ప్రణమిల్లి సింహాసనం దగ్గిరకి తీసుకు వెళ్తారు. ఇరాన్‌కి ఖోమేనీ ఎలాగో భారత దేశానికి తను అలా అవుతాడు.

ఎంత గొప్ప ప్రణాళిక

హిట్లర్ నెపోలియన్ అలెగ్జాండర్ చంగీజ్‌ఖాన్ ఎవరూ ఇంత గొప్ప వ్యూహాన్ని రచించి ఉండరు. దాన్ని అమలు జరపడానికి ఇన్నేళ్ళుగా ఇంత ఓర్పుగా వలపన్ని ఉండరు. అతడు దాన్ని సాధించాడు ఎక్కడికి వెళ్ళినా లక్షల సంఖ్యలో ప్రజలు దర్శనం కోసం తహతహ మొదటి రంగాం పూర్తయింది. రెండో రంగం మిగిలివుంది. అదే ఆఖరి దేశంలో కల్లోలం సృష్టించడం.

సజావుగా వెళుతున్న వాహనానికి సడెన్‌గా స్పీడ్ బ్రేకర్ అడ్డు వచ్చినట్టు సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ రిపోర్టు బయటకు వచ్చింది. చాలా చిన్న స్పీడ్ బ్రేకర్

రామోన్ హర్నాసేకీ అనంతస్వామికి మధ్య కలయిక గోల్డెన్ దీవిలో జరిగింది. రామోన్

అనుకున్నాడు అటువంటిదేమీ లేదు పూర్తి గార్డ్ ఆఫ్ ఆనర్‌తో అతడికి స్వాగతం లభించింది.

వెల్‌కమ్ టు గోల్డెన్ ఐలెండ్ అని స్వాగతం పలికాడు. రెండు గంటలపాటు ఆయుధాల పరీక్ష జరిగింది. సంతృప్తుడయ్యాడు రామోన్ రెండు మిలియన్ డాలర్లకు బేరం కుదిరింది.

స్వామి ఆతిథ్యం స్వీకరిస్తూ రిలాక్స్ అవుతున్న సమయంలో తనన్ని ఎప్పటినుంచో వేధిస్తూవున్న ప్రశ్న అడిగాడు రమోన్ హర్నాసే.

మా దేశంలో ప్రభుత్వాన్ని పడగొట్టవల్సి వస్తే ప్రభుత్వాధినేతల్ని చంపటమొక్కటే మార్గం. మీరు వేరే విధంగా ఎలా సాధించగలరు స్వామీ దీన్ని?

స్వామి నవ్వాడు. ప్రపంచపు అతి సంపన్న మైన దేశం ఏది రామోన్ హర్నాసే?

నిశ్చయంగా అమెరికా.

ఇరాన్ ఇరాక్ యుద్ధంలో అమెరికా ఎవర్ని సపోర్ట్ చేస్తుంది?

ఇరాక్‌ని.

మరి ఇరాన్‌కి ఎందుకు రహస్యంగా ఆయుధాలు అమ్ముతుంది?

రామోన్ వెంటనే జవాబు చెప్పలేకపోయాడు. స్వామి అన్నాడు. యుద్ధం ఆగిపోతే ఆయుధాలు ఎవరూ కొనరు. అది ఆగకూడదు. అమెరికా లక్ష్యం అదే ఇరాన్ ఇరాక్ ఎందుకు దెబ్బలాడుకుంటున్నాయి? ఇజ్రాయిల్ ఎందుకు పోరాడుతుంది? మతం మతం మనల్ని లాజిక్ ఆలోచించనివ్వదు. ప్రపంచంలో తెలివైన వాళ్ళు ఈ బలహీనతనే ఆధారం చేసుకుంటారు. 1980 సెప్టెంబర్‌లో ఈ యుద్ధం ప్రారంభమయింది. ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి జేనియర్ పెడజ్ ఏదో అద్భుతం చేసి ఇరాక్ ఇరాన్‌ల మధ్య సంధి సాధించకపోతే ఈ యుద్ధం ఈ నెలతో ఎనిమిదవ సంవత్సరంలో ప్రవేశిస్తుంది.

ఎంతో నాగరికత సాధించాడనుకున్న మనిషి చరిత్రలో ఇన్నాళ్ళు యుద్ధం సాగిందంటే దీనికి కారణం. మూర్ఖపు పట్టుదల కాక మరేమిటి? ఈ రకమైన మత్తునే నేను నా దేశ ప్రజలమీద చల్లబోతున్నాను. మతమే ఆయుధంగా భారతదేశాన్ని నా చేతుల్లోకి తీసుకోబోతున్నాను. నేనే డిక్టేటరుని నేనే మతాధిపతిని నేనే రాజ్యాధినేతని.

క్రీస్తుశకం 14వ శతాబ్దంలో బ్రిటన్ ఫ్రాన్స్‌ల మధ్య జరిగిన నూరేళ్ళ పోరాటం తరువాత ఈ గల్ఫ్ యుద్ధమే చరిత్రలో అతి ధీర్ఘ మైనది.

అతడి నవ్వుకి ఆ దీవి కదిలిపోయింది. ఎంతో కిరాతకుడయిన రామోన హర్నాసే ఆ స్వామి నవ్వుని చూసి క్షణం కాలం కంపించిపోయాడు. భగవంతునిక్కూడా కృతజ్ఞతలు చెప్పుకున్నాడు అనంతస్వామి పిలిప్పీన్స్‌లో పుట్టనందుకు అతడి ఆలోచన్లను చెదురుస్తూ స్వామి అడిగాడు నాతో పాటు పదిరోజులు ఆహ్లాదకరమైన పర్యటన జరపటానికి వస్తావా రామోన్?

ఎక్కడికి?

భారతదేశానికి. నీకో అద్భుతం చూపిస్తాను?

ఏమిటి స్వామి?

నాలుగు స్థంభాల మీద నిలబడిన భవంతి నాది. అందులో ఒక స్తంభం నాకు కుడి భుజమయిన ఒక రాజకీయ నాయకుడు. రాముడికి చందమామమీద ఆశ కలిగినట్టు ఆ నాయకుడికి చిన్న ఆశ కలిగింది దేశపు అతి సౌభాగ్యవంతమైన ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రి అవ్వాలని పాపం నాతో ఇన్నాళ్ళు పనిచేసిన నా అనుచరుడు కోర్కెని తీర్చటం నా ధర్మం కదా పది రోజుల్లో దాన్ని సాధించ బోతున్నాను పునాది వేశాను పై కప్పే మిగిలి వున్నది వస్తే చూపిస్తాను.

ఎలా స్వామీ?

నా దేశ ప్రజలకి సెంటిమెంట్లు ఎక్కువ. వారు నీతిపరులు దయార్ద్ర హృదయులు వారి ఈ గుణాల్నే ఉపయోగించుకోబోతున్నాను. చూద్దువుగాని రా ఏ రాష్ట్రంలో ప్రజలు తమ ముఖ్యమంత్రిని ప్రాణం కన్నా మిన్నగా చూసుకుంటారో ఏ రాష్ట్రంలో ఇప్పటి వరకు ప్రతిపక్షం నుంచి ఏ గొడవలూ లేవో ఏ రాష్ట్రపు ముఖ్యమంత్రి తన ప్రాణం కన్నా ఎక్కువగా తన రాష్ట్రాన్ని ప్రేమిస్తాడో అటువంటి ముఖ్యమంత్రిని ఆ పది రోజుల్లో పదవి నుంచి దింపి నా సహచరుడు కోరక కోరక కోరిన చిన్న కోర్కెను తీర్చబోతున్నాను వస్తావా?

రామోన్ హర్నాసేలో ఉత్సుకత పెరిగింది.

వస్తాను స్వామీ అన్నాడు.

## 4

మరుసటిరోజు పరిశ్రమల మంత్రి సూర్యారావు మీద హత్యా ప్రయత్నం వార్త ప్రముఖంగా వచ్చింది. అన్ని పార్టీలవాళ్ళూ దీన్ని ఖండించారు నికుంజ్ విహారి సంఘటనకి అంత ప్రాముఖ్యత ఎవరూ ఇవ్వలేదు మంత్రి ప్రాణాపాయాన్నించి తప్పించుకున్నందుకు అందరూ అభినందించారు టెర్రరిస్టు కార్యకలాపాలు విస్తరిస్తున్నందుకు విచారం వెలిబుచ్చారు.

మంత్రి మీద జరిగిన అఘాయిత్యానికి నగరంలో ఒకరోజు బంద్ జరిగింది. ఆ సాయంత్రం మంత్రి ప్రజల్నుద్దేశించి మాట్లాడారు. వారిని సమాధాన పరచటంతో అల్లర్లు కాలేదు.

పాత కక్షల కారణంగా ఈ హత్యా ప్రయత్నం జరిగిందని కొందరు వాదిస్తే మంత్రివర్గంలో అస్థిరత్వం కలిగించటానికి ఇది చర్యని కొందరు వాదించారు. అసలు సంగతి తెలిసినవాడు అనంతానంతస్వామి ఒక్కడే.

మంత్రి ప్రాణాలు రక్షించినందుకు ఆఫీసర్స్ మధ్య చిన్న అభినందన సభ లాంటిది జరిగింది మెయిన్ అట్రాక్షన్ ప్రవల్లిక అయింది. ఏ మాత్రం స్వజన ప్రాణనష్టం జరక్కుండా ఒక్క టెర్రరిస్టుని ప్రాణాలతో పట్టుకున్నందుకు అందరూ అభినందించారు. ముఖ్యమంత్రి ఆ ఫంక్షన్‌కు స్వయంగా హాజరయ్యారు. ప్రవల్లిక డిపార్ట్‌మెంట్‌కీ రాష్ట్ర ప్రభుత్వానికీ సంబంధం లేకపోయినా వచ్చి అభినందించారు.